# ఘన సన్మానం

ఉదయం తొమ్మిది గంటలై వుంటుంది. నాలుగు వీధుల కవతల బంధువులింట్లో ఆ యింటి కోడలు నీళ్ళాడిందని మీనాక్షమ్మ చూచిరావడానికి వెళ్ళింది. ఇంట్లో శర్మగారొక్కరే మిగిలారు. వార్తా పత్రికను చూడటం అప్పుడే ముగిసింది. ఆనాటి టపాకోసం చూస్తున్నారాయన. టపాలో వార మాసపత్రికలు కొన్ని వున్నాయి. క్రొత్త రచయిత ఒకతను పీఠిక వ్రాసి పెట్టమని ఓ పుస్తకం పంపించాడు. స్వంత పుస్తకాలను ప్రచురిస్తున్న పబ్లిషరు దగ్గర నుంచి అట్టలింకా వేయని పుస్తకం ఒకటి పరిశీలనకోసం వచ్చింది. ఇవిగాక అయిదారు ఉత్తరాలున్నాయి. ఏనాటి టపాకు ఆనాడే బదులు వ్రాయడం శర్మగారికి చిరకాలం నుంచీ వస్తున్న అలవాటు. ఇటీవల కొంత ఓపిక తగ్గినా పద్ధతి మార్చుకోలేదు. మీనాక్షి తిరిగివచ్చేలోగా ఈ పని కాస్తా ముగించాలి.

సదుద్దేశమేమరి! కానీ సత్కార్యానికి వెయ్యి విఘ్నాలు గదా!

మొదట వీధి గుమ్మం దగ్గర మనుషుల కలకలం మాత్రమే వినిపించింది. ఆ తరువాత నాలుగైదు రకాల పాద ధ్వనులు అంతకంతకూ చేరువౌతున్నట్టుగా తోచింది. వాటికి తోడుగా కరకంకణాల గలం గలలు కూడా! ఆపైన పువ్వుల వాసనలు, గుసగుసల నిస్వనాలు గూడా లోపలికి వ్యాపించాయి. ఒక్కుమ్మడిగా శర్మగారిని అచ్చెరువు చుట్టుముట్టింది. ఏమిటీ దాడి? ఎవరీ ఆగంతకులు?

బిలబిలా అయిదారుగురు యువతులు లోపలికి వచ్చేశారు.

వచ్చినవాళ్ళు ఎవరు, ఏమిటి, ఎందుకు అన్న ప్రశ్నలకైనా చోటివ్వకుండా భరత నాట్య శాస్త్రంలో అదొక భంగిమలా చేతులు జోడించి "నమస్కారమండీ!" అంటూ వినయం పాటించారు.

"నమస్కారం, నమస్కారం! ఎవరికోసమమ్మా అమ్మాయిలూ! బహుశా మీరు దారితప్పి ఉంటారు. హరిహరనాథ శర్మ అన్న పేరుతో వ్యవసహరింపబడుతున్న ఓ కవిని గురించి విన్నారా మీరు! ఆ కవినే నేను. నా కోసం ప్రచురణ కర్తలు రావడం

పరిపాటి. బాతాఖానీ వేయడానికి తెలుగు పండితు లెవరైనా రావటం పరిపాటి. శిష్యులో ప్రశిష్యులో, వారున్నాగాక పోతే ఈ యంత్ర యుగంలో గూడా సాహిత్యం ఒక అభిమానింనగ్గ విషయమే ననుకునే ఛాందసులో రావడం పరిపాటి! వాలకాన్ని బట్టీ చూస్తే మీరు పై వర్గాల్లో దేనికీ సంబంధించినట్టు తోచదు."

"కానీ మేము మీకోసమే వచ్చామండీ!" యువతీ పంచకానికి నాయికలా గోచరిస్తున్న ఓ మంజులవాణి బదులు చెప్పింది.

"ఆశ్చర్యం, ఆశ్చర్యం! ఎడారిలో వానలు కురిసినట్టుగా, కొండ గుహలోనికి వెన్నెల ప్రవేశించినట్టుగా, అడవి కొలనులో హంసలు వ్రాలినట్టుగా మీ రాక నా కత్యంత ఆహ్లాదకరంగా వుందని ఒప్పుకోక తప్పదు. కూర్చోండి. కూర్చోండి. ఇవే కుర్చీలు..."

ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ యువతులందరూ కుర్చీల్లో కూచున్నారు.

"వచ్చిన సంగతి విన్నవించుకోడానికి ముందుగా మమ్మల్ని మేము ముందుగా పరిచయం చేసుకోనిస్తారా మేష్టారూ!" మళ్ళీ నాయకురాలే ఉపక్రమించింది.

"పరిచయమా! అంతకన్న భాగ్యమా! కానివ్వండి!"

"ఆమె ప్రిన్సిపాలు జగన్నాథరావుగారి కుమార్తె రేవతి. ఈవిడ నీరజ. జడ్జీ రామగోపాలంగారి అమ్మాయి. ఆవిడ సరోజిని. గరల్స్ హైస్కూల్లో పనిచేస్తోంది. ఈమె శ్యామ. లీడింగ్ లాయర్ మురళీకృష్ణగారి శ్రీమతి. ఇక మిగిలింది నేను."

"ఆవిడగారిని నేను పరిచయం చేసిపెడతానండీ మేష్టారూ! పేరు వేదవతి. గృహ జీవితంలో డాక్టరు ధర్మారావుగారి సహధర్మిణి. సంఘ జీవితంలోనేమో, ఆదర్శ మహిళా సమాజానికి సెక్రెటరీ" హెడ్‌మిస్ట్రెస్ సరోజిని పూర్తిచేసింది.

"అలాగా! ఇంతమందిని ఒక్కసారిగా చూడ గలగడం చాలా అదృష్టమే. కానీ, అదృష్టంలో దురదృష్ట మేమిటంటే సమయానికి మా ఆవిడ యింట్లో లేకపోయింది. లేకుంటే ఈపాటికి మీకు ఏ కాఫీయో, ఏ శీతల పానియమో సమర్పించుకుని వుండేది."

"అబ్బే, వద్దండీ మేష్టారూ! చాలా థేంక్స్!"

"అయ్యో జరగని అతిథ్య మర్యాదకు గూడా కృతజ్ఞత చెప్పుకోవాలటమ్మా! సర్లే. ఆ మాటకేంగానీ నా వూహే గనుక నిజమైతే మీరందరూ ఏదో కార్యార్థంగా వచ్చినట్టున్నారు. అవునమ్మా సెక్రెటరీ?"

"చల్లకు వచ్చి ముంత దాచుకుంటామా మేష్టారూ? పనుండే వచ్చాము..."

"ఆ పనియొక్క తీరు తెన్ను లెట్టివో వివరించండి!"

"మరేం లేదు. మా మహిళా సమాజం సభ్యురాండ్ర కందరికీ చిరకాలం నుంచీ ఓ సంకల్పం వుంది..."

"ఏమిటది?"

"ఏమిటంటే... తాము చేయగలిగినంతలో అర్హులైన వారికెవరికైనా ఓ సన్మానం చేయాలని...."

"చూడమ్మాయ్! ఈ లోకంలో ఎవరు ఎవరికైనా సన్మానం చేసుకోవచ్చు. అది చేయించుకునే వాళ్ళ యిష్టంమీద, చేసేవాళ్ళ యిష్టంమీద ఆధారపడి వుంటుంది. ఇక్కడ చేయాలనుకుంటున్న వాళ్ళు మీరు. చేయించుకునే వాణ్ణిగా నేను నా అభిప్రాయాన్ని వెల్లడించక తప్పదు...."

"చూడండి మేష్టారూ!"

"చూడ్డాని కేముందమ్మా! నాకూ చాలా విచారంగానే వుంది- మీకు ఆశాభంగం కలిగించవలసి వచ్చినందుకు! సంగ్రహంగా ఒక మాటలో తేల్చి చెప్పమంటే యిదిగో యిదే నా మాట. మీరు నా దగ్గరకి చాలా ఆలస్యంగా వచ్చారు..."

"ఆలస్యంగానా?"

"అవును. పోలికగా ఓ పిట్ట కథ చెప్పమంటే చెబుతాను. మునుపటి కెప్పుడో ఓ రచయితగా రుండేవారట! అతడు పది పదిహేనేళ్ళ పొడుగునా పట్టుబట్టి ఓపిసన్ని రచనలుచేసి పారేశారట! అప్పటి కతడికో సత్యం తెలియవచ్చింది. రచయితకు కావలసిన లక్షణాల్లో తన కొక్కటైనా లేదని! తీరా మించిపోయాక అతడేం చేయగలడు? ఆ పాటికే గొప్ప రచయితగా అతనికి దేశంలో పేరూ, ప్రతిష్టా వచ్చేశాయి. ఒక విధంగా ఈ కథను నాకూ అన్వయించుకోవచ్చు. పదేళ్ళకు మునుపు నాకు సన్మానాలు చేయించుకోవాలన్న కోరిక మిక్కుటంగా వుండేది. అప్పుడవి ఆశించినంత ఎక్కువగా జరగని మాట వాస్తవం! కానీ రానురానూ సన్మానాలపట్ల నా అభిప్రాయం మారుతూ వచ్చింది. ఇప్పుడు సన్మానాలంటే మోజు తగ్గడమే గాదు, రోత గూడ పుట్టింది..."

"అదికాదండీ మేష్టారూ..."

"అదేనమ్మా అదే! ఎంతసేపు మాట్లాడినా నేను చెప్పబోయేది అదే! నేనేదో వ్రాశాను. అది గొప్ప కవిత్వమని కొందరంటారు. అబ్బే ఎందుకూ పనికిరాని చెత్త అని కొందరంటారు. మధ్యలో మీలాంటి వాళ్ళు కొందరు సన్మానాలు తలపెడతారు. మక్కువపడి పిలిచారు గదా అని ముచ్చటపడి చేసుకుందామని వెళ్తే ఆ సన్మాన సభలన్నీ చెప్పుకోదగ్గ గొప్ప ప్రహసనాల్లా తయారౌతున్నాయి. ఈ దేశంలో సాహిత్యాన్ని గురించి, సినిమాలను గురించి, రాజకీయాలను గురించి విడివిడిగా మాట్లాడేవాళ్ళు లేరు. ఉపన్యాసకులందరిదీ ఒకటే వర్గం. ఒక్కటే ధోరణి. వాళ్ల కోఆపరేషన్ దగ్గర నుంచీ ఆపరేషన్ దాకా దేన్ని

గురించైనా సరే అనర్గళంగా మాట్లాడగలరు. వాళ్ళ మాటలు వింటుంటే నాబోటి చాదస్తం బట్టినవాళ్ళకు మతిపోయినంత పనౌతుంది. ఒకాయన పేరుపొందిన సినిమాతారకు, నా కావ్య నాయికకు కొన్ని సాదృశ్యాలున్నాయని చెప్పి, అప్పటికి తనేదో పెద్ద గొప్ప కాంప్లిమెంటు యిచ్చినట్టుగా మురిసిపోయాడు. ఇంకొకాయన మరీ విచిత్రమైన విషయం ఒకటి బయట పెట్టాడు. గొప్ప గొప్ప కవులందరికీ పెద్ద పెద్ద గడ్డాలుండటం సాంప్రదాయమట. పూర్వం వాల్మీకి, వ్యాసులకు గడ్డాలుండేవట! ఇటీవలి కాలంలో రవీంద్రుడు, టాల్‌స్టాయ్, బెర్నార్డ్‌షా మొదలైనవారు గూడా గడ్డాలవాళ్ళేనట! ఆ రివాజు పాటించి నేనూ ఒక మాదిరి గడ్డం పెంచితే బాగుంటుందిట! మరొకాయన పై ఇద్దరి కంటే రెండాకు లెక్కువగా చదివిన మనిషి. ఆయనకి యిలాతలం పుట్టిన నాటినుంచీ ఈనాటి వరకూ నచ్చిన కవులు యిద్దరే యిద్దరట! ఆ యిద్దరిలోనూ నే నొకడినట! రెండో మహానుభావుడెవరో ఆయన చెప్పనే లేదు. చూడండమ్మా అమ్మాయిలూ! చూడడంగాదు. శ్రద్ధగా వినాలి మీరు. ఒకసారి నేను రైలు ప్రయాణం చేస్తున్నాను. ప్లాట్‌ఫారంపైన ఓ అపరిచిత వ్యక్తి కలిశాడు. తన వూరూ, పేరూ చెప్పుకున్నాడు. కాసేపు ఆ మాట, ఈ మాటా చెప్పుకున్న తర్వాత "నేను మా వూరిలో మీకొక సన్మానం ఏర్పాటు చేస్తాను మేష్టారూ! మీ వూరిలో నా కొకటి చేయిస్తారా" అన్నాడు. "సన్మానాలు యిలాంటి వినిమయ పద్ధతిపైన గూడా జరుగుతున్నాయా?" అని ప్రశ్నించాను. "మీరు నన్ను వేళాకోళం పట్టిస్తున్నారుగానీ యివన్నీ మీకు తెలియని విషయాలాయ?" అన్నాడు."

"మన్నించండి మేష్టారూ! మీరు మా విన్నపాన్ని సాకల్యంగా వినిపించుకోనేలేదు. మేము మీకు సన్మానం చేసేంతటి వాళ్ళమూ కాము. ఆ వుద్దేశంతో యిక్కడకి రానూలేదు..."

శర్మగారు తెల్లబోయారు.

"మీరొక సన్మాన సభకు అధ్యక్షత వహించాలి. అంతే చాలు. అదే మా కోరిక...."

"అలాగటమ్మా! ఐతే నేనే తొందరపడ్డానన్నమాట! సన్మాన సభకు అధ్యక్షత వహించడమే అయితే అందుకు నేను అభ్యంతరం చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే, హమేషా నాటకాలాడే వాడికి తా నొకసారి ప్రేక్షకుల మధ్య కూర్చుని ఒక నాటకాన్ని తనివితీరా చూడాలన్న కోరిక ఎలాగూ వుండనే వుంటుంది. మీరొక వారం రోజులు ముందుగా జ్ఞాపకంచేస్తే చాలు. ఎన్ని పనులున్నా సరే, మీ సభకు తప్పక హాజరు కాగలను..."

"మీనాక్షమ్మ గారిని గూడా కలుసుకో వచ్చుననుకున్నాము. సమయానికి ఆమె యింట్లో లేకపోయారు" అంది వేదవతి.

"ఫరవాలేదు. నేను చెబుతానుగా! ఇప్పుడిప్పుడు ఎక్కడికి వెళ్ళినా మేమిద్దరమూ కలిసే వెళుతున్నాము. సాయంకాలాల్లో ఆవిడకు మాత్రం యింట్లో ఎలా ప్రొద్దుపోతుంది?"

"అలాగైతే మేము వెళ్ళొస్తామండీ మేష్టారూ!"

"మంచిదమ్మా మంచిది. వెళ్ళిరండి!"

ఆదర్శ మహిళా సమాజం సభ్యురాండ్రు వెళ్ళిపోయిన తర్వాత శర్మగారు ఉత్తరాలు వ్రాయడం పూర్తిచేశారు. ఓ మాసపత్రికను ఆదినుంచీ చివరి దాకా తిరగవేశారు. అంతలో గంటకూడా పదకొండు కావచ్చింది.

గంట పదకొండు కొట్టడమేమిటి, మీనాక్షమ్మ లోపలికి రావడమేమిటి రెండూ ఒక్కసారే జరిగాయి.

"ఏమిటండీ, ఏం చేస్తున్నారు? ఎంత తొందరగా రావాలనుకున్నా వాళ్లు రానిచ్చారు గాదు. టంచనుగా పన్నెండు కొట్టేసరికి వంట సిద్ధం గాకపోతే మీరు నా భరతం పడతారని వాళ్ళకు తెలియదు..."

"నన్ను గురించి లోకానికి తెలిసింది చాలా తక్కువ మీనాక్షీ! నన్ను గురించి కూలంకషంగా తెలిసిన దానివి నువ్వొక్కతెవే!"

"ఆకాడికి మీరు నన్ను పొగడుతున్నట్టో, తిడుతున్నట్టో నా కర్థం గాదు."

"అర్థమయ్యేట్టుగా నువ్వు నన్నెన్నడూ చెప్పనివ్వలేదు..."

"మీతో మాట్లాడుతూ కూచుంటే అవతల నాకు వంటెవరు చేసిపెడతారు?"

"హోటలు నుంచీ క్యారియర్ తెప్పించుకుందాం."

"ఎందుకూ! అన్నం తినకుండా లేచి పోవడానికా! వద్దు బాబూ వద్దు. ఐనా ఎంతసేపు? పట్టుగా చేస్తే అరగంటలో అయిపోదూ!"

ఆ మధ్యాహ్నం మీనాక్షమ్మ భోజనం వడ్డిస్తుండగా అడిగారు శర్మగారు – "ఆదర్శ మహిళా సమాజ మట మీనాక్షీ! ఎక్కడో ఈ వూరిలోనే వుందట! ఎరుగుదువా నువ్వు?"

"ఎవరో చెప్పగా విన్నట్టే గుర్తు! వాళ్ళతో మీకేం పనొచ్చిందండీ?"

"నాతో వాళ్ళకే పనొచ్చింది. ఏదో సన్మాన సభకు అధ్యక్షత వహించాలట."

"అలాగా ఒప్పుకున్నారా మీరు?"

"అయినింటి ఆడపడుచులు వచ్చి మర్యాదగా పిలిస్తే నిరాకరించ గలమా మీనాక్షి? తప్పక రాగలననే చెప్పాను..."

"మంచి పనే చేశారుగానీ యింతకూ సన్మానం ఎవరికండీ?"

"ఉండుండు మీనాక్షీ! అదీ పాయింటే! ఆమాట అడగటానికే మరిచిపోయాను..."

"ఇదేం అన్యాయమమ్మా! సన్మాన మెవరికో తెలుసుకోకుండా ఆ సభ కధ్యక్షత వహిస్తారా మీరు?"

"ఈగ యిల్లలుకుతూ తన పేరు మరచిపోలేదా మీనాక్షీ! నేనూ అంతే." శర్మగారు బిగ్గరగా నవ్వసాగారు. నవ్వి నవ్వి యిలా ముగించారు- "ఐనా సన్మానం ఎవరికి జరిగితే మనకేం మీనాక్షీ! శరీరం మనది గాకపోతే కాశీదాకా ప్రాకవచ్చు. సన్మానం నాకు కాదుగదా! అంతే నాకు కావలసింది."

పదిరోజులు గడచిపోయాయి. ఆ పదిరోజుల్లో ఆదర్శ మహిళా సమాజం వారి పొలకువ కనిపించనూ లేదు, అలికిడి వినిపించనూ లేదు. అందుకు శర్మగారు ఆశ్చర్యపడనూ లేదు. ఎందుకంటే, సన్మానాలు చేయాలనుకోడం ఎంత సహజమో, వాటిని మానివేయడమూ అంతే సహజం. బయటికి చెప్పడానికి వీల్లేనందున సుభాషితాలు తన శరీరంలోనే జీర్ణమైపోతున్నా యని చెప్పలేదా భర్తృహరి! ఆదర్శ మహిళా సమాజం వారి సంత్సంకల్పం గూడా అలాగే పుట్టిన వెంటనే గిట్టిపోయిందేమో! అయ్యో పాపం! ఆ సన్మానం ఎవరికోసమైతే ఉద్దేశింపబడిందో అతని పట్ల శర్మగారి సానుభూతి మాత్రం ఉండనే వుంది.

కానీ ఆ సానుభూతిని పటాపంచలు చేస్తూ పది రోజుల తర్వాత ఒకనాటి ఉదయం ఆదర్శ మహిళాసమాజం తాలూకు మహిళలిద్దరు శర్మగారిని దర్శించారు. ఏవో యిబ్బందుల వల్ల ఆహ్వాన పత్రాలు అచ్చువేయడానికైనా వ్యవధి లేకపోయిందని విన్నవించారు. "సాయంకాలం ఆరు గంటలకే మీటింగు. అయిదున్నర కల్లా జట్కాబండి యిక్కడ యింటి ముందర ఆగుతుంది. సకాలంలో మీ రాక కోసం వేచిచూస్తూంటాం" అని మనవి చేసుకున్నారు.

"అలాగా! సంతోషం. చాలా సంతోషం" గ్రుక్క త్రిప్పుకున్నారు శర్మగారు- "చేసిన పాపం చెబితే పోతుందంటారు. వర్తమానాలేవీ లేక పోయేసరికి మీరు సన్మానం మాట కట్టిపెట్టేశారేమో ననుకున్నాను..."

"ఫరవాలేదు. దానికేంలెండి మాష్టారూ!"

"తప్పిదాన్ని మన్నించేశారు గనుక నా బెంగ కూడా తీరినట్టే!...." అన్నట్లు స్వరం హెచ్చించి లోపలికి ఉద్దేశిస్తూ అన్నారు శర్మగారు. "ఇదిగో మీనాక్షీ, అమ్మాయిలు ఇద్దరు వచ్చారు గానీ, ఒకసారి యిలా వచ్చి వెళ్ళు..."

ఎక్కడో లోపల వుండిపోయిందేమో మీనాక్షమ్మ ఈవలికి రావడానికి ఒక నిమిషం పట్టింది-

"వచ్చావా మీనాక్షి! రెండు వారాల క్రిందట ఆదర్శ మహిళా సమాజాన్ని గురించి చెప్పుకున్నాం గదా! అక్కడినుంచీ మళ్ళీ కబురు వచ్చింది. ఈరోజు సాయంకాలమేనట మీటింగు."

"మీ మీటింగు మాటకేంగానీ, వచ్చిన వాళ్ళను నిల్చోబెట్టేశారేమండీ! కూర్చోమని చెప్పలేక పోయారా?"

"ఎందుకండీ! చూచుకోవలసిన పనులు చాలా వున్నాయి. మాష్టారు గారితో చెప్పి వెళ్ళాలని యిలా వచ్చాము. సాయంకాలం సభకు మీరు గూడా వస్తారు గదూ?"

"అయ్యో! పిలిచిన పేరంటానికి వెళ్ళడం మానేస్తారటమ్మా ఎవరైనా?"

"అదే మరి. వెళ్ళొస్తామండీ, నమస్తే!"

"చూచావా మీనాక్షీ! ఆడవాళ్ళు వాళ్ళ సంసార సామ్రాజ్యంలో మాత్రమే నిరంకుశులనీ, కార్యశూరులనీ నేను భావించేవాణ్ణి. ఇప్పుడిప్పుడు వాళ్ళు మిగిలిన లౌకిక వ్యవహారాలన్నింటిలోనూ తమ కార్య శూరత్వాన్ని నిరూపించుకుంటున్నారు. మరికొంత కాలానికి వాళ్ళు అన్ని రంగాల్లోనూ మగవాళ్ళను త్రోసి రాజంటారేమో?"

"అంటే అననివ్వండి! ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయని చెప్పింది మీరేకద! ఐనా ఈ కప్పల తక్కెడ మాటకేం గానీ– ఆ సన్మానం ఎవరికో తెలుసుకున్నారటండీ?"

"మీనాక్షీ!" ఆశ్చర్యాతిరేకంతో నోరు తెరిచేశారు శర్మగారు– "కొంత కాలం నుంచీ నా కనుమానమైతే వుంది. అదీనాటికి నికరంగా నిజమే నని తేలిపోయింది. కరిమ్రింగిన వెలగపండులా నా బుర్రలో నుంచి జ్ఞాపక శక్తి శాశ్వతంగా నిష్క్రమించిందనే ఇక మనం భావించవలసి వుంటుంది. ఐనా నా మతి మరుపు సంగతి నీకు తెలియనిదా మీనాక్షీ! ఆమాట నువ్వైనా అడిగి తెలుసుకోరాదూ?"

"భోజరాజు ముఖాన్ని చూస్తే ఎలాంటి మూర్ఖుడికైనా కవిత్వం పుట్టుకొచ్చేది కదటండీ!" చిరునవ్వును పమిట చెరగులో దాచుకుంటూ గబ గబా లోపలికి వెళ్ళిపోయింది మీనాక్షమ్మ.

ఒకటి రెండు నిమిషాలు గడచిన తర్వాత గానీ ఆ ఛలోక్తి కర్థమేమిటో బోధపడిందిగాదు శర్మగారికి.

◆ ◆ ◆

సభలన్నా సమావేశాలన్నా శర్మగారికి తేలిక భావం ఏర్పడటానికి చాలా కారణాలున్నాయి.

కేవలం మాటల వల్లనే లోకోద్ధరణ జరగదు. పూలదండలు, ఉపాహారాలు మున్నగు వాటికి ఎంతో కొంత ఖర్చువుతున్న మాట నిజమేగానీ, సభల్లోనూ, సమావేశాల్లోనూ ఎక్కువగా ఖర్చయ్యేవి మాటలే! కార్యనిర్వాహకులు, ఉపన్యాసకులు జరుగుతున్న సభలవల్ల లోకానికేదో ఒరిగిపోతున్నదని పదే పదే చెప్పడం వల్ల ఆ మాట నిజమేనేమోనన్న భ్రమ తాత్కాలికంగా సభాసదులను సమ్మోహనం చేసేమాట నిజమే! కానీ నూటికి తొంభై తొమ్మిది సభల విషయంలో యింటికి తిరిగి వచ్చి నింపాదిగా ఆలోచిస్తే అవి కొందరు వ్యక్తులు తమ పలుకుబడీ, ప్రతిష్ట పెరగడంకోసం ఏర్పాటు చేసుకున్న తతంగాలు మాత్రమేనని ఎవరికైనా బోధపడి తీరుతుంది- ఇదీ శర్మగారి అభిప్రాయం.

పోగా ఈ సభల్ని నిర్వహించే ఎత్తుగడలో నిర్ణీత కార్యక్రమం గూడా లాంఛన ప్రాయమైనదేనని శర్మగారి విశ్వాసం. ఆరుగంటల కనుకున్న సభ ఎనిమిదికైనా ప్రారంభం గాకపోవచ్చు. అధ్యక్షుడు రాకపోవచ్చు. ఉపన్యాసకులు తమ కోసం ఉద్దేశింపబడిన విషయాలను వదలిపెట్టి యధేచ్ఛగా శాఖాచంక్రమణాలు సల్పవచ్చు. ఆ యీకారణాలవల్ల సభలనగా ఎలాంటి అవకతవకలైనా జరగడానికి వీలున్న కొన్ని నిర్దిష్ట ప్రదేశాలని శర్మగారి నిర్వచనం.

కానీ శర్మగారి అభిప్రాయాన్ని ఖండించడాని కన్నట్టుగా ఆ రోజు సాయంకాలం అయిదూ ముప్పైకి సరిగ్గా జట్కా బండి వచ్చి గుమ్మంలో ఆగింది. ఆలుమగ లిద్దరూ ఒకరినొకరు వేగిరించుకుని ఆదరాబాదరాగా బయల్దేరి వెళ్ళేసరికి అధ్యక్షులవారు రావడమే ఆలస్యమన్నట్టుగా సభాస్థలమంతా ఆహూతులతో క్రిక్కిరిసి పోయింది.

"ఇటు, అటు" అంటూ సంస్కృత నాటకంలో కంచుకిలా ఓ కార్య నిర్వాహకురాలు శర్మగారిని నేరుగా వేదికపైకి తీసుకెళ్ళి అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టింది.

కూర్చుంటూ సభనంతా ఒకసారి కలయజూశారు శర్మగారు. చూచిన క్షణంలో శర్మగారి ఆశ్చర్యం ద్విగుణీకృతమైందనే చెప్పవచ్చు.

సభల్లో సాహిత్య సభలు, సన్మాన సభలు కవల బిడ్డలలాంటివి. ఈనాడు ప్రజలే రాజులు గనుక. ఆ ప్రజల ఆదరమేమో ప్రముఖంగా సినిమాల పైకి, రాజకీయాలపైకి ప్రసరిస్తోంది గనుక ఇవి ఆలనా పాలనా లేని బిడ్డలు గూడా! వీటిని నిర్వహించడం కోసం డబ్బును పుట్టించడం మరు భూమిలో వరిపైరు పండించినంత కష్టం. ఏదేని యింద్రజాలం వల్ల డబ్బును పుట్టించబోము. సభ నిండుకూ జనాన్ని ప్రోగు చేయడం మరింత కష్టం. ఆదర్శ మహిళాసమాజం ఈ రెండో పని గూడా సాధించింది.

"సభాసదులైన పెద్దల కందరికీ నమస్కారాలు..." హఠాత్తుగా శబ్ద విస్తరణ యంత్రంలో నుంచీ మాటలు గూడా వినిపించే సరికి శర్మగారటు వైపు తిరిగారు. సెక్రటరీ వేదవతి మాట్లాడుతోంది-

"ఎంత కాలం నుంచి ఆలోచనగా వుండిపోయిన ఈ సన్మాన సభ ఈనాటికిలా కార్యరూపం ధరించడం మా అదృష్టం. దీనికి కోరిన వెంటనే అధ్యక్షత వహించడానికి అంగీకరించిన శ్రీ శర్మగారికి మా ధన్యవాదాలు. ఈ వేదిక పైన నేను శర్మగారిని గురించి చెప్ప బూనడం సూర్యుణ్ణి దివిటీతో చూపించడం. సభలో ఆయన్ను గురించి తెలియనివారు లేరు. ఆయన ఎన్ని భాషల్లో కవిత్వం చెప్పగలరో, ఎన్న భాషలతో ఆయనకు పరిచయం వున్నదో నాకు తెలియదు. చిన్ననాడు ఆయన వూరు విడిచి వెళ్ళి కాశీలో వుండి సంస్కృత విద్యాభ్యాసం చేసి వచ్చారని కొందరు చెబుతారు. ఆయన రేయింబవళ్ళు అదే ధ్యాసతో గనుక శ్రమించి వుండకపోతే ఎన్నో ఉద్గ్రంథాలు తాళపత్రాల్లో నుంచి వెలుగులోకి వచ్చి వుండేవి గావు. వారు కొన్ని మహా కావ్యాలకు పీఠికలు వ్రాశారు. మరికొన్నిటికి వ్యాఖ్యానాలు రచించారు. ఇవిగాక పద్యంగా, గద్యంగా, గేయంగా ఆయన సాగించిన మౌలిక రచన పది పదిహేను వేల పుటలకు మించి వుంటుందని అభిజ్ఞుల అంచనా! జీవితాన్ని ఇలా పూర్తిగా సాహిత్యానికే అంకితం చేసిన వాళ్లు చాలా అరుదు..."

ఆ మాటలతో అధ్యక్షుల వారికి చెల్లించవలసిన మర్యాద ఆయనకు చెల్లించి విషయాంతరంలోకి వచ్చింది వేదవతి.

"పోగా ప్రస్తుతాంశాన్ని గురించి చేసిన పనుల్నే చేయడం, చెప్పిన కథలే మళ్ళీ చెప్పడం, ఎక్కడా ఎందులోనూ క్రొత్తదనం కనిపించకపోవడం - వీటి వల్ల జీవితంలోని మాధుర్యం సన్నగిల్లి పోతుంది. ఈ మధ్య ఓ ఆనకట్ట ప్రారంభోత్సవం ఓ సాధారణ కార్మికుడి చేతి మీదుగా జరిగిందని తెలియగా ఎంతో ఆనందం కలిగింది. జీవితేతిహాసంలో గుర్తింపదగిన వాళ్ళు గుర్తింపబడకపోవడం. గౌరవింపదగిన వాళ్లు గౌరవింపబడకపోవడం చాలా దురదృష్టకరం. ఈ విధంగా ఆలోచించిన మీదట మా ఆదర్శ మహిళా సమాజానికి యిలా ఒక క్రొత్త తరహాలో సన్మానం చేయాలన్న ఉద్దేశం కలిగింది...."

లేనిది సభలో సవ్వడి మాత్రమే గాదు. సభికుల్లో చైతన్యం గూడా!

"చరిత్రలో ఎందరో మహా వీరులు. ఎందరో కవులు. ఎందరో విజ్ఞానవేత్తలు. మరెందరో మేధాసంపన్నులు కానవస్తారు. చేబట్టిన కర్తవ్యంలో వాళ్ళు అసాధారణ విజయాలకు వెనుక అందుకు దోహద క్రియలు సలిపిన అజ్ఞాత వ్యక్తుల్ని గురించి లోకం ఎందుకాలోచించదో మనకర్థం గాదు. ఉదాహరణకు పోతన్నగారినే తీసుకుందాం.

ఆయన లేమిలోనే పుట్టి, లేమిలోనే పెరుగుతూ, ఎప్పుడు బడితే అప్పుడు ఆ లేమినే పటాపంచలు చేయడానికి వీలున్నప్పటికీ అట్టి ప్రలోభానికి లోబడకుండా అజరామరమైన కీర్తిని సంపాదించాడు. తానెన్నుకున్న అసిధారావ్రతం లాంటి జీవన పథంలో ఆయన ఒంటరిగా నడచి వుండడని నా అనుమానం, పలుకు తోడుగా, తోడునీడగా అర్థాంగి వెన్నంటి నడవడం వల్లనే ఆయన సురక్షితంగా గమ్యస్థానం చేరుకోగలిగి వుంటారని నా నమ్మకం...!"

సభలో నుంచి ఉత్సాహవంతుడెవరో కరతాళ ధ్వనులకు నాందీ వాచకం పలికాడు. పదిమందీ చేతులు కలిపారు. శర్మగారు మాత్రం ఈ కథ ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్తుందో తెలియక బిక్కచూపులు చూడసాగారు.

వేదవతి కొనసాగించింది-

"పైన పేర్కొన్న కారణాలను పురస్కరించుకుని ఈనాడు మీనాక్షమ్మగారికి సన్మానం చేయాలనుకున్నాం. ఇందుకు పెద్దలందరూ హృదయపూర్వకంగా అంగీకరింపగలరని ఆశిస్తున్నాం..."

కరతాళ ధ్వనులు వీలైనంత బిగ్గరగానే ఈ ప్రతిపాదనను బలపరిచాయి.

శర్మగారు ఉలికిపడ్డారు. అందాకా బొత్తిగా జ్ఞప్తిలో లేని విషయం ఒకటి తటాలున ఆయన బుర్రలో మెరిసింది. సభా ప్రాంగణంలో తనతో బాటుగా జట్కా దిగిన మీనాక్షి ఆ తరువాత ఏమైంది? ఏదీ, సభలో కనిపించదే! సభనంతా గాలించి ఆయన చూపులు మళ్ళీ వేదిక దగ్గరకు తిరిగి వచ్చాయి. అక్కడ తనకు దాపున్నే ఒక కుర్చీలో మగువ పొలకువ దృక్కోణానికి అనగానే తల పైకెత్తి అటువైపు చూచారు. 'హో తెలిసెన్!' అనుకున్నారాయన. ఇదంతా కట్టుదిట్టంగా అల్లుకున్న ఒక పథకం ప్రకారం జరుగుతున్న తతంగమన్నమాట!

"ఇప్పుడు పినాకపాణిగారు ఉపన్యసిస్తారు..." అని ముగించింది వేదవతి.

ఈ సందర్భంలో ఉపన్యసించడానికి పినాకపాణిని ఎన్నుకున్న వారి బుద్ధి విశేషాన్ని మెచ్చుకోకుండా వుండలేక పోయారు శర్మగారు. పినాకపాణి చిన్ననాటి చదువుల్లో తన సహాధ్యాయి. నాటినుంచీ నేటివరకూ తన వ్యాసంగాలన్నింటిలోనూ యితనికి పరిచయం కద్దు. అంతెందుకు, చిన్న చిన్న వివరాలు సైతం పొల్లుబోకుండా తన జీవిత గాథను ఒప్పగించి గలిగిన వాడు యితడొక్కడే!

పినాకపాణిగారు గూడా అందుకు సంసిద్ధులుగానే వున్నట్టు రంగం పైకి వచ్చారు. బట్టతలను పరామర్శించుకుంటూ, తెల్లటి బొద్దు మీసాలకు మందహాసపు వెల్లులు మెరుగులు దిద్దుతుండగా నింపాదిగానే ప్రారంభించారు.

"అధ్యక్షా! సభాసదులారా! ఇంత కాలానికి సన్మానార్హురాలినిగా గుర్తింపబడ్డ మీనాక్షమ్మగారూ! మీకందరికీ నా నమస్కారాలు. వెంటనే ఓ క్షమాపణ గూడా! పుట్టింది మొదలు గిట్టేవరకూ మనమెన్నో అనుచితమైన పనులు చేస్తుంటాం. బహుశా తమకందరికీ తెలిసే వుంటుంది. పూర్వాశ్రమంలో నేను హైస్కూలు హెడ్మాస్టరుగా పనిచేశాను. అప్పట్లో నేను తరచుగా ఉపన్యాసాలివ్వవలసి వచ్చేది. ఆ ఉపన్యాసాల్లో నేను ప్రతి డి.ఇ.ఓ నూ బృహస్పతికి ధీటుగానే అభివర్ణించాను. ప్రతి స్కూలు కమిటీ ప్రెసిడెంటును ఏ కర్ణుడితోనో, దధీచితోనో ఉపమిచాను. ఆ పాపాల కన్నిటికీ పరిహారంగా ఈ వానప్రస్థాశ్రమంలో నేనిక మీదట అబద్ధాలు చెప్పనే చెప్పగూడదన్న నిర్ణయాన్ని తీసుకున్నాను. ఈ నిర్ణయాన్ని గట్టిగా అమల్లో పెట్టడానికి నేను ఉపన్యాసాలివ్వడం మానేశాను. కాని నిన్నటి సాయంకాలం సెక్రటరీ వేదవతమ్మగారు మా యింటికి వచ్చి నా నోట సరేననిపించేదాకా కదిలేది లేదని పట్టుబట్టి కూర్చునేసరికి భవదీయుడు ఆమె కోరికను కాదనలేక పోయాడు. అందుకు కారణాలు రెండు. మొదటిది; వేదవతిగారు డాక్టరు ధర్మారావుగారి సహధర్మిణి. మరేమో డాక్టరు ధర్మారావుగారు మా గృహవైద్యులు. పోగా రెండో కారణం యిది; ఇది కాస్త బలవత్తరమైనది గూడా! ఈ నా ఉపన్యాసంలో నేనన్నీ నిజాలే చెప్పవచ్చునని ఆమె నాకు హామీ యిచ్చారు.

"మీనాక్షమ్మగారికి సన్మానమనగానే నాలో మొట్టమొదట కలిగిన భావాన్ని ఆశ్చర్యం అనవచ్చు. ఆశ్చర్యమెందుకంటే – నా వూహకందినంతలో ఆమె తనకు సన్మానం కావాలని కలలోనైనా ఆశించి వుండదు. విరాగిని పెళ్ళి పీటలపైన కూర్చోబెట్టినట్టు, ఆమెను సన్మాన పీఠంపైన కూచోబెట్టడం నా మట్టుకు నాకు న్యాయం కాదేమో ననిపిస్తుంది. లోకంలో ఈ సన్మానాల కోసం ఉబలాట పడుతున్న వాళ్ళెందరు లేరు? ఎవరి దాకానో ఎందుకు? ఒకప్పుడు శర్మగారు సైతం వీటికోసం తహతహలాడినట్టే నాకు జ్ఞాపకం! అప్పట్లో శ్రీవారి కొక మహానగరంలో గొప్ప సన్మానం జరిగింది. దాని మూలంగా ఆయనకు లభించిన కీర్తి ప్రతిష్ఠలేపాటివో నాకు తెలియదు. కానీ ఖరీదైన ఒక కాశ్మీరు శాలువాతో బాటుగా ఆయనకు అయిదువందల రూపాయిల నగదు గూడా బహుకరింపబడింది. ఆ రోజుల్లో అయిదువందల రూపాయిలంటే తక్కువ మొత్తంగాదు. అయితే యిల్లు చేరుకునేసరికి కాశ్మీరు శాలువ కనిపించనేలేదు. అయిదువందల రూపాయిల అయిపేలేదు. పెట్టెకు పెట్టే మాయమైపోయింది. మిగిలిందల్లా తామరాకుల్లో కట్టి తీసుకొచ్చిన పూలదండ మాత్రమే! రైలు ప్రయాణంలో ఎవరో బుద్ధిమంతుడు కవిగారి పెట్టెను కాజేశాడు. డబ్బు పోయినందుకు చింతించక పోవడం అటుండగా పూలదండ సురక్షితంగా యింటికి రావడం మీనాక్షమ్మకు మహదానందం కలిగించింది. డబ్బుకు బదులుగా పూలదండే

గనుక పోయివుంటే అదొక గొప్ప అశుభ సూచనగా భావించి ఆమె దిగులు పడిపోయి వుండేదేమోనని నా అనుమానం. ఎందుకు చెబుతున్నానంటే అసలు రహస్యమంతా యిక్కడే వుంది. మగవాళ్ళు లోకం నుంచి ఆశించేవి వెయ్యి వున్నాయి. పరువు ప్రతిష్ఠ పలుకుబడీ డబ్బు సన్మానాలు మొదలైనవి. మగువకివన్నీ తృణప్రాయాలు. ఆమె వాంఛించే దొక్కటే - భర్త క్షేమం.

"పోగా మీనాక్షమ్మకు సన్మానం చేయడంలో ఔచిత్యం ఏపాటి దన్నదే నన్నెదుర్కొన్న రెండో ప్రశ్న. కావ్యాలు వ్రాశారని కవికి సన్మానాలు చేయడం లోక సహజం. వ్రాయడం కాదు సరిగదా, మీనాక్షమ్మ కాపీ చేసినట్టు గూడా తోచదు. సహవాస దోషం వల్లనైనా మీనాక్షమ్మకు కవిత్వం పట్టుబడి వుండవలసింది. అబ్బిందిగాదు.

"ఏతావాతా తేలిందేమంటే మీనాక్షమ్మకు సన్మానాలు చేయించుకోవాలన్న అభీష్టమూ లేదు; ఆమెకు సన్మానం చేయడంలో ఔచిత్యమూ కనిపించదు.

"అవును. బాహ్యదృష్టికి యిలా అనిపించేమాట నిజమే; సముద్రంలో లాగే జీవితంలో గూడా లోతుకు వెళ్ళి చూస్తేగాని అమూల్యమైన సత్యాలు బయటపడవు.

"వాదం కోసమే గానివ్వండి, నేనొకమాట చెప్పదలచుకున్నాను. కావ్యాలు వ్రాశాడనే గదా కవికి సన్మానం! ఏదో మాటవరుస కలా చెప్పుకోవడమేగాని నిజానికి కావ్యాలు కవి వ్రాసినవి గావు. అవి కవిచేత వ్రాయబడినవి. వ్రాసినది అతడి కలం. అందుకని ఓ బంగారపు తొడుగు చేసి పెట్టి, గంధంపూసి, పన్నీరు చిలకరించి ఆ కలానికెందుకు సన్మానం చేయగూడదు? కలం తనంతట తానుగా కవిత్వం వ్రాయలేదు గనుక. ఆమాట కొస్తే కవిగూడా తనంతట తానుగా కవనమల్లలేదు! ఇతర కవుల సంగతి యిప్పుడు నాకొద్దు. శర్మగారి విషయంలో వ్రాస్తున్న కలంలో సిరా నిండుకుంటే - చేస్తున్న పనులన్నీ వదిలిపెట్టి వచ్చి మీనాక్షమ్మ మళ్ళీ దాన్ని సిరాతో నింపేదాకా కవితాస్రవంతి ముందుకు సాగదు.

"అయ్యా! మీరందరూ లోలోపల నాపైన కోప్పడుతున్నారేమోనని నా అశంక! శర్మగారి గొప్పతనాన్ని కించపరచడం కాదు నా ఉద్దేశం. ఆయనకు మానవుల మనోధర్మాలను గురించి తెలిసినంత బాగా మార్కెట్టులో కూరగాయల ధర తెలియదు. మహా భారతంలో ఎన్ని పద్యాలున్నాయో ఆయనకు తెలుసు కాని, పెట్టెలో తనకెన్ని చొక్కాలున్నాయో తెలియవు. గొడుగును పోస్టు బాక్సులో దూర్చి, కార్డును తలకద్దంగా పట్టు కున్న మతి మరపు ప్రొఫెసరుగారిని గురించి తెలిసే వుంటుంది మీకు! శర్మగారి మతిమరపు అంతకన్నా గొప్పది. ఆయన ఏదో వస్తువు కోసం గదినంతా చిందర వందర

చేసి ఆ గందరగోళంలో తాను వెదకుతున్న వస్తువునే మరచిపోగలడు. అప్పుడు మీనాక్షమ్మ రావాలి. శర్మగారికప్పుడు అవసరమైన వస్తువేదై వుంటుందో ఊహించాలి. అదెక్కడుంటుందో పసిగట్టాలి... అప్పుడుగానీ యింట్లో ప్రశాంతత నెలకొనదు!

"శర్మగారికి అయిదుగురు కొడుకులున్నారు; ముగ్గురు కూతుళ్ళున్నారు. కుమారులందరూ మంచి ఉద్యోగాల్లో వుండగా, కూతుళ్ళు ముగ్గురూ చల్లగా సంసారాలు చేసుకుంటున్నారు. వాళ్ళలో ఎవరికైనాసరే శర్మగారు తానొక వారం పదిరోజులపాటు వాళ్ళ దగ్గర గడపదలచుకున్నట్టు జాబు వ్రాస్తే, "వద్దు బాబో వద్దు" అంటూ టకీమని బదులు రావడం ఖాయం. రెండేళ్ళ పసికుంకతో వేగడం కన్నా శర్మగారితో వేగడం చాలా కష్టమని వాళ్ళకు బాగా తెలుసు. ఆయన కాఫీ, కాఫీ అంటూ కలవరిస్తాడు. కాఫీచేసి తీసుకొచ్చేసరికి తాంబూల చర్వణానికి ఉపక్రమిస్తాడు. తాంబూలం ముగించేపాటికి కాఫీ చల్లారిపోతుంది. మళ్ళీ వెచ్చచేసి తీసుకు రావాలి. ఇంతా చేశాక కాఫీలో పంచదార ఎక్కువై వుంటుంది. లేదా చాలినంత వుండకపోతుంది. ఒక్క కాఫీకోసం వంటింటికి హాల్లోకి పదిసార్లు తిరగవలసి వస్తే అందుకు చిరాకు పడకుండా వుండటం అందరికీ చేతగాదు. ఇప్పుడు నేను చెప్పింది నిత్యజీవితంలో శర్మగారితో ఎదురయ్యే చిన్న చిక్కును గురించి మాత్రమే! శర్మగారు బోలెడు గ్రంథాలు వ్రాశారని సెక్రటరీ గారు చెప్పారు. ఎవరు కాదనగలరు? కానీ ఒక్కొక్కప్పుడు ఆయనకు తానేమీ వ్రాయలేదనీ, అథవా వ్రాసినా అది కాలానికి మారొడ్డి నిలవదేమోనని ఓ తీవ్రమైన అసంతృప్తి కలుగుతుంది. అది నిరుత్సాహానికి దారి తీస్తుంది. ఆ నిస్పృహ మూలంగా కొండంత బరువు తలపైన పడ్డట్టుగా ఆయన వాలుకుర్చీలో సొమ్మసిల్లిపోతాడు. స్విచ్చి ఆన్‌చేసి దీపం వెలిగించి నట్లుగా అప్పుడిక ఒక్క మాటలో ఆ నిరుత్సాహాన్ని పటాపంచలు చేయగల వరాన్ని భగవంతుడొక్కరికి మాత్రమే ప్రసాదించాడు. శర్మగారి కింకొక బెంగ గూడా వుంది. జబ్బులాంటి దేదీ లేకపోయినా ఏదో వున్నట్టే భ్రమించడం. నిజానికది ఒక మానసికమైన జబ్బయితే గావచ్చు! ఈ జబ్బును నయం చేయడం గూడా మీనాక్షమ్మ కొక్కతికే తెలుసు! ఈ కిటుకులు, ఈ వైద్య ప్రక్రియలు యివన్నీ తెలియకపోతేనేమిగానీ, శర్మగారి బిడ్డలందరూ చాలా బుద్ధిమంతులు. "వద్దు బాబూ వద్దు' అనడంతో వాళ్లు ఉత్తరం ముగించరు. "వద్దంటే మీరు రానే రాగూడదని గాదు మా అభిప్రాయం! మీ రాక మాకెప్పుడైనా ఆనందదాయకమే! కానీ మీరు దగ్గర లేకుంటే అమ్మకక్కడ ఒంటరిగా ఎలా ప్రొద్దు పోతుంది? కొద్ది రోజులపాటు యింటి నెవరినైనా చూచుకోమని చెప్పి, ఆమెను గూడా వెంటబెట్టుక రండి' అంటూ సాగదీస్తారు.

"సభాసదులారా! శతాధిక గ్రంథభావాన్ని తేటతెల్లంగా ఒక్కమాటతో చెప్పి వేయగల బుద్ధి కుశలతను నాకు భగవంతుడివ్వలేదు. ఐనా ఒక విధంగా నాలుగైదు మాటలలోనైనా నేను నా ఉపన్యాసం సారాంశాన్ని తేటతెల్లం చేయడానికి ప్రయత్నిస్తాను. శర్మగారు నాకు ప్రాణ స్నేహితుడు. నిజమే కాని, రాముడు లేని రామాయణాన్ని, గాంధీ లేని స్వాతంత్ర్యోద్యమాన్ని నే నెలాగైతే ఊహించలేనో, మీనాక్షమ్మగారు లేని శర్మగారిని సైతం అలాగే వూహించలేను. ఉపమానం చెప్పి తీరాలని మీరు మంకుపట్టు పట్టినట్టయితే, అమంగళం శాంతించాలని కోరుకుంటూ తుఫానులో తెరచాప లేకుండా నడికడలిలో తగులుకున్న పడవను పేర్కొంటాను.

"ఇంత దూరం చెప్పిన తర్వాత యిక్కడ మళ్ళీ నన్నొక సందేహం వెన్నాడుతోంది. ఏమంటే రవి గానకపోయినా కాంచగలిగినవారు కవులు! 'చాల్లేవయ్యా! ఇంతా జేసి యిది నా అర్ధాంగికి జరిగిన సన్మానమే గదా! 'అర్ధాంగి' అన్న పదానికి గనుక మీకు అర్థం తెలిస్తే ఈ సన్మానంలో నాకు గూడా వాటా వుండనే వున్నదని మీరే గ్రహించగలరు" అంటూ ఛాతీ విరచుకొన్నా విరచుకోగలడు కనుక – యిప్పుడు పూలదండలతో, పట్టు వస్త్రాలతో, మంగళ హారతులతో జరగబోతున్న గౌరవమేదైతే వుందో అది సతికి సన్మానం, పతికి ఘన సన్మానం!"

❀ ❀ ❀